సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం ı 16 ı జూన్ ı 2023



రెవెన్యూ, పోలీసుల వాగ్వాదం
పట్టణంలో అర్బన్ పోలీసులు, రెవెన్యూ ఉద్యోగుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రెవెన్యూ ఉద్యోగులు పోలీసు స్టేషన్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. - 8లో



గూడెంచెరువు పోస్టాఫీసులో గోల్‌మాల్
జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలోని పోస్టాఫీసులో రూ.15 లక్షల మేర అవకతవకలు జరిగాయి. - 8లో



దయచేసి వినండి.. దొంగలున్నారండి !
రైలు బోగీల్లో ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్న సమయంలో అదను చూసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. - 8లో

ప్రకృతికి ప్రణామం!

- 70,252 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం
- ప్రకృతి బాటలో 96400 మంది రైతులు
- 249 గ్రామ పంచాయతీల్లో పంటల సాగు
- 2022–23 లక్ష్యం 1లక్ష ఎకరాలు
- వేరుశనగ, మామిడి, బత్తాయి, వరి, శనగ, కూరగాయల సాగు
- ఢిల్లీకి మామిడి ఎగుమతి, శనగలు టీటీడీకి
- రైతు భరోసాల్లో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాలు



వైఎస్సార్ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఒకే పాలంలో వివిధ రకాల పంటలు సాగు చేసిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, కడప : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తగినంత ఆహార ఉత్పత్తి కోసం హరిత విప్లవం ద్వారా అధికోత్పత్తి సాధించే లక్ష్యంతో ప్రభుత్వాలు పనిచేశాయి. అధిక దిగుబడికి హైబ్రీడ్ రకాల సీడ్స్, రసాయనిక ఎరువులు, పురుగు మందులను ప్రోత్సహించారు. పర్యవసానంగా సాగు భూములు విషతుల్యమయ్యాయి. భూపోషకాలు నశించాయి. కొత్త తెగుళ్లు పుట్టుకొచ్చాయి. భూమి నిస్సారమైంది. పంటల పెట్టుబడులు రైతులకు భారమయ్యాయి తప్పా, ఆశించిన దిగుబడులు లేవు. రసాయన ఎరువులు, మందుల వాడకంతో కార్బన్‌డైయాక్సైడ్ ఉత్పత్తి పెరిగింది. వాతావరణం కలుషితమైంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు భూ సంరక్షణ, వాతావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రకృతి వ్యవసాయం ప్రత్యామ్నాయమైంది. ఈ తరహా వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

ప్రకృతి వ్యవసాయం దిశగా..

2018 నాటికి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 51 మండలాల పరిధిలో కేవలం 14,803 ఎకరాల్లో మాత్రమే సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయం క్రమేపీ పెరిగింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరాక ఈ ఏడాది నాటికి ఉమ్మడి జిల్లాలో 372 గ్రామ పంచాయతీల పరిధిలో 90,191 ఎకరాల్లో సాగులోకి వచ్చింది. 2023–24 ఏడాది నాటికి విభజన జిల్లాలో 1 లక్ష ఎకరాలు ప్రకృతి సేద్యం లక్ష్యంగా పెట్టుకున్నారు.

జిల్లాలో ప్రకృతి సాగు ఇలా

పంట	ఎకరాలు	రైతుల సంఖ్య
వరి	28,650	30,920
వేరుశనగ	5,720	6,920
ఉద్యాన పంటలు	23,700	27,059
కూరగాయలు	5,830	6,850
శనగలు	4,800	6,570
ఇతర పంటలు	1,552	18,081
మొత్తం	70,252	96,400

సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయ పంటలు

జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వరిలో నవార, బర్మా బ్లాక్, మణిపూర్ బ్లాక్, కుజి పటాలియా, కృష్ణ వ్రీహి, కాలాభట్, మాపులేసాంబ, బహురూపి, రాధాజిగేల్, రత్నచోడి, రక్తసాలి, ఇంద్రాణి, సుగంధి, సిద్ది సన్న, పరిమళ సన్న, తదితర రకాల వరి సాగు చేస్తున్నారు. వీటితోపాటు వేరుశనగ, చీనీ, అరటి, శనగ, బొప్పాయి, ఇతర కూరగాయల పంటలు సైతం పండిస్తున్నారు.

రసాయనిక ఎరువులు, పురుగు మందులు నిషేధం

రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. పోషకాహారం ఎరువు స్థానంలో ఘన జీవామృతం పేరుతో పేడ, పప్పుదినుసుల పిండి, నల్లబెల్లం, పుట్టమట్టి, ఆవు లేదా ఇతర పశువుల మూత్రం కలిపి ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్నారు. ఇదే వస్తువులను నీటిలో కలిపి జీవామృతం పేరుతో డ్రిప్ లేదా స్ప్రింక్లర్ల ద్వారా ఎరువుగా పంటకు అందజేస్తున్నారు. ఇక పంటలకు తెలుగుళ్లు సోకితే నివారణకు నీళ్లలో వేపాకు పిండి, పేడ, కుంకుడు కాయల పొడి తదితర వాటిని కలిపి వడగట్టి దోమపోటుతోపాటు ఇతర తెగుళ్లకు పిచికారీ చేస్తూ నియంత్రిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ప్రకృతి వ్యవసాయసాగులో ఉన్న పంటలకు తెగుళ్ల నిరోధకశక్తి కూడా పెరగనున్నట్లు నిపుణులు వివరిస్తున్నారు.

ప్రకృతి విభాగంలో నాణ్యమైన దిగుబడి

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రధానంగా రైతుల పెట్టుబడుల ఖర్చు తగ్గుతోంది. భూసారం క్షీణించదు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా, ఆ ఆనవాళ్లే లేని నిఖార్సైన కలుషితం లేని ఆహారం తినడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతోందని వైద్యులు సైతం చెబుతున్నారు. రసాయనిక ఎరువులతో పండించే పంట ధర కంటే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు ధర ఎక్కువగా ఉంటోంది. ఉదాహరణకు రసాయనిక ఎరువులతో పండించిన పుట్టి వరి ధాన్యం రూ.12 వేలు ఉంటుండగా, అదే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వడ్ల ద్వారా రూ.60 వేల వరకూ ఉంటుందని, 15 రకాల దేశీయ వరి పండించే బద్వేలుకు చెందిన రైతు రాధాకృష్ణయ్య చెబుతున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్ర స్థాయిలో రైతు సాధికారత సంస్థ పర్యవేక్షిస్తుండగా, జిల్లాలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు విభాగం చూస్తోంది. డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ ఆధ్వర్యంలో ఈ విభాగం పనిచేస్తోంది. ఇందులో నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్స్ (ఎన్ఎఫ్ఏ) మాస్టర్ ట్రైనర్స్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, గ్రామ స్థాయిలో ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (ఐసీఆర్‌పీ) పనిచేస్తున్నారు. 2016 నుంచి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ప్రారంభమైంది. తొలుత కొన్ని పంచాయతీలలో ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయం ప్రస్తుతం విభజన జిల్లాలో 249 గ్రామ పంచాయతీల్లో ఉంది. అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలోకి ఈ వ్యవసాయాన్ని విస్తరిస్తున్నారు. ఒక్కో ఐసీఆర్‌పీ 50–100 మంది రైతులను గుర్తించి ప్రకృతి వ్యవసాయంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా దగ్గరుండి వ్యవసాయం చేయిస్తున్నారు. రైతు భరోసాలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేసి దేశీ విత్తనాలను రైతులకు అందించనున్నారు. 40శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోంది. జిల్లాలో పండించిన శనగలను టీటీడీ కొనుగోలు చేయగా, అరటి పంటను ఢిల్లీకి ఎగుమతి చేస్తున్నారు. దేశీయ వెరైటీ వరి పంటకు మంచి డిమాండ్ ఉంది.

15 రకాల దేశవాళి వడ్లు ఉత్పత్తి చేస్తున్నా



ఐదేళ్ల నుంచి ఆరున్నర ఎకరాల పొలంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తున్నాను. 15 రకాల దేశవాళి ధాన్యం పండిస్తున్నాను. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన పురాతన సీడ్స్ ఆధారంగా పంట పండిస్తున్నాను. ఎకరాకు 16 బ్యాగులు వస్తున్నాయి. రెండు ఎకరాల్లో కరివేపాకు సాగు చేస్తున్నాను. ఘన జీవామృతం, జీవామృతం, వేప కషాయం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం తదితర ఎరువులు, పురుగు మందులు వాడి పంటలు పండిస్తున్నాను. మామూలుగా పండించిన పంటల కంటే ఈ తరహా వ్యవసాయంలో పంటలకు అధిక ధర వస్తోంది. కరివేపాకు సీడ్స్ ఉత్పత్తి చేస్తున్నా.
– గోగుల రాధాకృష్ణయ్య, రైతు, అబుసాహెబ్‌పేట, బద్వేలు మండలం.

ఆరేళ్లుగా ప్రకృతి వ్యవసాయమే



ఆరేళ్లుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఐదెకరాలు పొలంలో వరి, మిరప పండిస్తున్నాను. ఈ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పురుగు మందులు, రసాయన ఎరువులు వాడకపోవడం వల్ల దిగుబడి తగ్గినా, ధర బాగా ఉంది.
– ఎం రామాంజనేయులు, ప్రకృతి వ్యవసాయ రైతు, పల్లవోలు, చాపాడు మండలం.

ప్రకృతి వ్యవసాయం మరింత విస్తృతం



ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాలో 2018 వరకు దాదాపు 15 వేల ఎకరాల్లో ఉన్న ప్రకృతి వ్యవసాయం ప్రస్తుతానికి 90 వేల ఎకరాలకు చేరింది. సీజన్ ముగిసేనాటికి విభజన జిల్లాలో 1లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేపట్టాలన్నది లక్ష్యం. ప్రకృతి వ్యవసాయంతో భూములు దెబ్బతినకుండా ఉంటాయి. ఈ విధానంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.
– రామకృష్ణరాజు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయం, కడప.

న్యూస్‌రీల్

విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

– విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ



'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని విద్యుత్ శాఖ(ఆపరేషన్) పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో ఆయన వినియోగదారుల నుంచి ఫోన్ ద్వారా సమస్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా కడప, ఖాజీపేట, కొండాపురం, పోరుమామిళ్ల, సీకే దిన్నె, చాపాడు, పెద్దముడియం, బద్వేల్ మండలాల నుంచి ఏడుగురు ఫోన్ చేసి సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు పి. సుబ్రమణ్యం, జీవీ సుబ్బారావు, జేఈ ఎస్. లావణ్య పాల్గొన్నారు.

20 నుంచి క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

కడప ఎడ్యుకేషన్ : డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 2023–24 సంవత్సరానికి 4, 5 తరగతుల్లో ప్రవేశాల కోసం కడప మండల స్థాయి, జిల్లాస్థాయి ఎంపికలను నిర్వహించనున్నట్లు స్టెప్, డీఎస్ఏ సీఈఓ సాయిగ్రేస్, చీఫ్‌కోచ్ అమృతరాజ్ తెలిపారు. కడప మండలస్థాయి ఎంపికలను కడపలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో(మున్సిపల్‌గ్రౌండ్), 23వ తేదీన జిల్లాస్థాయి ఎంపికలను మున్సిపల్ గ్రౌండ్‌లో, 29వ తేదీన రాష్ట్రస్థాయి పోటీలను గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తారన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారు 2023–24 విద్యా సంవత్సరానికి కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతుల్లో ప్రవేశానికి అర్హులని వారు తెలిపారు.

అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

చింతకొమ్మదిన్నె : కడప నగర శివార్లలోని ఊటుకూరు సమీపంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించినట్లు కళాశాల అధినేత చొప్పా గంగిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సుధాకర్ రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో అమలు చేసే విద్యా విధానాలు, ఫలితాలు, అధ్యాపకుల పరిశోధన విభాగాలు, మౌలిక సౌకర్యాలు, విద్యార్థులకు అందించే సదుపాయాల్లో నాణ్యతను పరిశీలించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయంప్రతి పత్తి హోదా ఇచ్చిందని తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబర్ మాసంలో తమ కళాశాల న్యాక్ గ్రేడ్ గుర్తింపు పొందడం, ఇప్పుడు స్వయం ప్రతిపత్తి హోదాను పొందడం ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో కళాశాల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

వల్లూరు : వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శారదమ్మ తెలిపారు. మండలంలోని కొప్పోలు గ్రామ సచివాలయంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్న చిన్న, సన్న కారు రైతులు, మేకలు, గొర్రెల పెంపకం దారులను ఆదుకోవాలనే ధ్యేయంతో ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఒక్కో కుటుంబం 5 పశువులకు, 50 వరకు గొర్రెలు, మేకలకు పథకాన్ని వినియోగించుకోవచ్చన్నారు. 2 నుంచి 10 సంవత్సరాల లోపు వయసు గల ఆవులు, 3 నుంచి 10 సంవత్సరాల వయసు గల గేదెలు, ఒకటిన్నర సంవత్సరాల పైబడిన వయసు గల మేలు జాతి ఎద్దులు, దున్నలకు, 6 నెలలు,ఆపైన వయసు గల గొర్రెలు, మేకలకు పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు రవీంద్రారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా 'జగనన్న ఆణిముత్యాలు'



కడపలో జగనన్న ఆణిముత్యాలుకు ఎంపికైన విద్యార్థులతో జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి ప్రభాకర్‌రెడ్డి

- నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పంపిణీ
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతి నియోజకవర్గంలో ఆయా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రతి నియోజకవర్గంలో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు సంబంధించి రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలతోపాటు ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 15 వేల నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రం, మెమెంటోలను అందజేశారు. కడప, మైదుకూరు, బద్వేలు, పులివెందుల, ప్రొద్దుటూరు, కమలాపురం, జమ్మలమడుగు నియోజకవర్గాల పరిధిలో పదవ తరగతిలో 33 మందికి, ఇంటర్మీడియట్‌లో 28 మంది విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలుకు ఎంపిక చేశారు. కడపలో జిల్లా సమగ్రశిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, కమలాపురంలో ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, బద్వేలులో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ, ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, పులివెందులలో పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మైదుకూరులో డీఈఓ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ అండ్ హెల్త్ జోన్-4లో 19 నుంచి బదిలీల ప్రక్రియ

కడప రూరల్ : వైద్య ఆరోగ్యశాఖ జోన్-4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలోగల ఉద్యోగులకు ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు సాధారణ బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడుతున్నట్లు ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. 19వ తేదీ ఉదయం స్టాఫ్ నర్స్, హెడ్ నర్స్, సిస్టర్ ట్యూటర్, పీహెచ్ఎన్ (టీ), మధ్యాహ్నం నుంచి ఫార్మసిస్ట్ గ్రేడ్-2, ఫార్మసీ సూపర్‌వైజర్ ఫార్మసిస్టు గ్రేడ్-1, డీపీఎంఓ, హెల్త్ ఎడ్యుకేటర్‌లకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. 20వ తేదీ ఉదయం పీహెచ్ఎన్ (ఎన్‌టీ), ఎంపీహెచ్ఎస్ (ఎఫ్), మధ్యాహ్నం నుంచి ఎంపీహెచ్ఎస్ (ఎం), 21వ తేదీ ఉదయం ఎంపీహెచ్ఈఓ, రేడియోగ్రాఫర్, ఏఎస్ఓ, డిప్యూటీ ఎస్ఓ, డిప్యూటీ డెమో, ఎన్ఎంఏ (ఎన్‌జీ), మధ్యాహ్నం నుంచి ఆఫీసు సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్‌లకు బదిలీల కౌన్సెలింగ్‌ను చేపడుతున్నామని తెలిపారు.

కుటీర పరిశ్రమగా వానపాముల తయారీ

- తిరుపతి పరిశోధన స్థానం సహసంచాలకులు డాక్టర్ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి పరిశోధన స్థానం సహసంచాలకులు డాక్టర్ రమణ

కడప అగ్రికల్చర్ : నేటి పోటీ ప్రపంచంలో రైతులు వ్యవసాయంతోపాటు వానపాముల తయారీని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని అదనపు ఆదాయం పొందాలని తిరుపతి పరిశోధన స్థానం సహసంచాలకులు డాక్టర్ రమణ అన్నారు. గురువారం ఊటుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఆర్య పథకంలో వానపాముల ఎరువుల తయారీపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల కారణంగా ప్రతి ఒక్కరూ సేంద్రియ ఉత్పత్తులపై ఆసక్తి చూపుతున్నారన్నారు. సేంద్రియ ఎరువుల కొరత వలన ఎక్కువమంది వానపాముల ఎరువుపై మొగ్గు చూపుతున్నారని తెలిపారు. కనుక రైతులు దీనిని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆత్మ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూ సమతుల్యత దెబ్బతిని పంట ఉత్పాదకత తగ్గిపోతుందన్నారు. భూసారాన్ని పెంపొందించుకునేందుకు తక్కువ ఖర్చుతో అన్ని పోషకాలు ఉన్న సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ వానపాముల ఎరువుల తయారీ ద్వారా రైతులు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సాయి మహేశ్వరి వర్మీ కంపోస్ట్ తయారీకి అనుకూల పరిస్థితులు, కావాల్సిన పరికరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మురళీకృష్ణ, శిల్పకళ, లావణ్య, స్వామి చైతన్య, మహేష్‌బాబు, ప్రశాంతి, మానసతోపాటు రైతులు పాల్గొన్నారు.

ఐదుగురు తహసీల్దార్లకు పోస్టింగులు

కడప సెవెన్‌రోడ్స్ : డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేస్తూ ఇటీవల పదోన్నతులు పొందిన ఐదుగురు తహసీల్దార్లకు కలెక్టర్ విజయరామరాజు పోస్టింగ్‌లు ఇచ్చారు. బద్వేలులో డీటీగా పనిచేస్తున్న ఏవీ రమణమ్మను బద్వేలు ఆర్డీఓ కార్యాలయ ఏఓగా, రాజంపేట ఎస్ఎస్‌పీ యూనిట్-4 ఎస్‌డీసీ కార్యాలయంలో పనిచేస్తున్న వి.వెంకట సుబ్బయ్యను వేముల తహసీల్దార్‌గా,ముద్దనూరు డీటీ సి.గురప్పను జమ్మలమడుగు తహసీల్దార్‌గా, కలెక్టరేట్ డీటీ ఎం.శరత్‌ను అక్కడే సోషల్ వెల్ఫేర్ ల్యాండ్ అక్విజేషన్ తహసీల్దార్‌గా నియమించారు. కాగా జేసీ సీసీగా పనిచేయాలని నిర్దేశించారు. ఎర్రగుంట్లలో పనిచేస్తున్న బి.లక్ష్మిదేవిని సిద్దవటం తహసీల్దార్‌గా నియమించారు.

ప్రశాంతంగా సచివాలయ సెక్రటరీల బదిలీల కౌన్సెలింగ్



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కడప కార్పొరేషన్ : జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న వార్డు సచివాలయ సెక్రటరీల బదిలీల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం కడప నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో అధికారులు ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. దివ్యాంగ ఉద్యోగులు, మానసిక దివ్యాంగులైన పిల్లలున్నవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, భార్యభర్త ఇరువురూ ఉద్యోగులైనవారు, విడో, ఒంటరిమహిళ, మ్యూచువల్‌కు సంబంధించిన వారికి ఈ బదిలీలు నిర్వహించారు. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు 23 మంది, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు 12 మంది, వార్డు వెల్ఫేర్ అండ్ డెవెలప్‌మెంట్ సెక్రటరీలు–10 మంది, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు–12 మంది, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు–10 మంది, వార్డు శానిటేషన్ సెక్రటరీలు–14 మందిని బదిలీ చేశారు. ఏడుగురి దరఖాస్తులను తిరస్కరించారు. ఈ కౌన్సెలింగ్‌లో మేనేజర్ హిదాయతుల్లా, డీటీసీపీ క్రిష్ణసింగ్, పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి, కమిషనర్ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చొరవతో కాలుష్య గ్రామాల తరలింపు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో మంగంపేట, కాపుపల్లె, దళితవాడ, అరుంధతివాడ కాలుష్య గ్రామాల తరలింపు వేగవంతంగా జరుగుతోందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మంగంపేట కాపుపల్లె గ్రామంలో గ్రామాల తరలింపు ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో గ్రామాలను తరలించి మెరుగైన పునరావాసం కల్పిస్తామన్నారు. దాదాపు రూ. 250 కోట్ల రూపాయల పరిహారం చెల్లిస్తామని తెలిపారు. కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, గ్రామస్తుల సహకారంతో తరలింపు ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. మూడు గ్రామాలలో దాదాపు 673 కుటుంబాలు తరలింపునకు సహకరించారని ఆర్అండ్‌ఆర్ చట్టం ప్రకారం పునరావాసం కల్పిస్తామన్నారు. పదిరోజుల్లో గ్రామస్తులకు పరిహారం అందజేస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ విప్, కలెక్టర్ ముక్కావారిపల్లె పంచాయతీలోని లేఅవుట్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, ఆర్డీఓ భాస్కర్, సీనియర్ నాయకులు ముక్కా మధుసూదన్‌రెడ్డి, గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, సర్పంచ్ మినుగు సుధాకర్, సీపీఓ సుదర్శన్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటిమడుగు సుధాకర్ రాజు, తహసీల్దార్ పీర్ మున్ని, ఎంపీడీఓ విజయారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యంపై కేసు నమోదు



నాగపద్మ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగర శివారులోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తిలక్‌నగర్‌కు చెందిన నాగపద్మ (20) అనే యువతి ఈ నెల 4వ తేదీ నుంచి కనిపించకుండా పోయిందని ఆమె తల్లి సుగుణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలియజేశారు. తన కుమార్తె గత కొంత కాలం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ షాపులో పని చేస్తోందని తెలిపారు. రోజు మాదిరిగానే ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని తెలియజేశారు. ఆమె ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కడప అర్బన్ : కడప నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి (35–40) మృతి చెందాడు. గురువారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. బ్లూకోల్ట్స్ వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతని చేతికి ఫాతిమా అనే పేరుతో పచ్చబొట్టు వుంది. అతను అనారోగ్యంతో మృతి చెంది వుంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా తమను నేరుగా సంప్రదించవచ్చని కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తెలియజేశారు. సీఐ సెల్ నంబర్లు 91211 00510, 9121100511కు సమాచారం అందించాలని కోరారు.

దయచేసి వినండి.. దొంగలున్నారండి..

- పొంచి ఉన్న మాయగాళ్లు
- నగలు, సెల్ చోరీలకు యత్నాలు
- మహిళలే లక్ష్యంగా దోపిడీలు
- కిటికీల వద్ద అప్రమత్తత అవసరం

రాజంపేట : ముంబయి–చెన్నై కారిడార్ మార్గంలో ఉభయ జిల్లాలను కలుపుతూ ప్రధాన రైలు మార్గం ఉంది. ఇప్పుడు వేసవి సీజన్‌లో రైలు ప్రయాణాలు అధికంగా ఉంటాయి. యాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శన, పర్యాటక టూర్లకు వేలాదిగా రైళ్లలో వెళ్తుంటారు. రైలు బోగీల్లో గాఢ నిద్రలో ఉన్న సమయంలో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. కిటికీల వద్ద ఉన్న వారి వద్ద నగలు చోరీ చేస్తున్నారు. రైలు రన్నింగ్‌లో పరారీ అవుతున్నారు. అయితే రైళ్లలో విధులు నిర్వర్తించే విషయంలో పోలీసుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఇదే దొంగలకు కలిసి వస్తోంది. గత సంఘటలతోపాటు ఇటీవల గుంటూరు– తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలుపై దోపడీ దొంగల ముఠా దాడి సంఘటన రైల్వేపోలీసులు, రైల్వే రక్ష కదళాలను ఉలిక్కి పడేలా చేసింది.

మిడ్‌సెక్షన్‌లో దారి దోపిడీలు

రైలు ప్రయాణిస్తున్న తాము ఎంచుకున్న వ్యూహం ప్రకారం చైన్ లాగి మిడ్ సెక్షన్‌లో దారి దోపిడీలు చేపట్టిన సంఘటనలు ఉమ్మడి జిల్లాలో లేకపోలేదు. జనరల్ బోగీలలో ప్రయాణికుల వలే ప్రయాణిస్తూ అనువైన ప్రాంతాలు వచ్చిన సందర్భంలో వీలును బట్టి విచక్షణారహితంగా దాడులు చేయడం, దౌర్జన్యంగా నగలు, విలువైన వస్తువులు దోచుకోవడం జరుగుతుంటాయి. అలాగే రిజర్వేషన్ కోచ్‌లో కూడా టికెట్ లేకుండా ప్రయాణిస్తూ టీటీఈ టికెట్ అడిగితే అపరాధ రుసుంతో ప్రయాణిస్తూ, ఆ ముసుగులో కొందరు దొంగతనాలకు పాల్పడి పరారీ అవుతున్నారు.

లాంగ్‌ట్రైన్స్ టార్గెట్..

ఎక్స్‌ప్రెస్ రైళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. దొంగతనాలలో వివిధ రకాల విధానాలు ఎంపిక చేసుకొని ముందుకెళుతున్నారు. టికెట్ తీసుకొని అనుమానం రాకుండా బోగీలోనే ప్రయాణిస్తూ చోరీలకు పాల్పడుతున్న దొంగలు కొందరు. అలాగే రైళ్లను దారికాచి దోపిడీకి దిగడం, ఇందులో రైళ్లను వ్యూహాత్మకంగా నిలిపివేసేందుకు పాల్పడి, ఆ తర్వాత బోగీ వద్ద ఒకరు వంగితే వానిపై మరొకరు ఎక్కి కిటికీల పక్కన గాఢ నిద్రలో ఉన్న వారి మెడలో నగలను దోచుకుంటుంటారు. జనరల్ బోగీల్లో చిన్న చితక చోరీలకు పాల్పడే వారు కొందరైతే, దోపిడీలకు పాల్పడే ముఠాలు కూడా ఉన్నాయి. అధికంగా



ఎక్స్‌ప్రెస్ రైలు

ఉత్తరాదికి చెందిన ముఠాలే రైళ్లలో దోపిడీలకు పాల్పడినట్లుగా రైల్వే వర్గాలు నుంచి వినిపిస్తోంది. వీటన్నింటినీ అరికట్టాలంటే జీఆర్పీలు, ఆర్పీఎఫ్లు, నిరంతర నిఘా రిజర్వేషన్ బోగీలపై ఆయుధాలతో గస్తీ పడకుండా చేయాల్సిన అవసరం ఉంది. అందుకే సరిపడే మెన్ కూడా అందుబాటులో తీసుకురావాల్సి ఉంది.

రైలుమార్గం		ముంబై-చెన్నై	
ఉమ్మడి జిల్లా రైలు మార్గం		రేణిగుంట-కడప-గుంతకలు	
జీఆర్పీస్టేషన్లు		రేణిగుంట, కడప, నందలూరు, ఎర్రగుంట్ల	
ఆర్‌పీఎఫ్ స్టేషన్లు		కడప, నందలూరు, ఎర్రగుంట్ల	
జిల్లా మీదుగా నడిచే రైళ్లు		30 (డౌన్, అప్)	
స్టేషన్లు	25	కిలోమీటర్లు	180

అడ్డుకట్ట వేయాల్సింది ఆ శాఖలే..

రైల్వేపరంగా రక్షకదళం, ప్రభుత్వ రైల్వేపోలీసు విభాగాలు ఉన్నాయి. ఈ రెండు శాఖల కనుసన్నల్లో రైలు ప్రయాణాలు భద్రతపరమైన చర్యలు తీసుకుంటుంటారు. రైళ్లలో మితిమీరుతున్న చోరుల ఆగడాలు, మహిళలే లక్ష్యంగా జరిగే దోపిడీ యత్నాల నుంచి ప్రయాణికులను కాపాడాల్సిన బాధ్యత జీఆర్పీ, ఆర్‌పీఎఫ్‌లపై ఉంటాయి. ఈ మార్గంలో రైళ్ల సంఖ్య పెరుగుతున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది, జీఆర్‌పీఎఫ్లు తక్కువగానే ఉందనే సమాచారం. కాగా ఎంపిక చేసిన రైళ్లకే పరిమితమైన భద్రతను కల్పించడం జరుగుతోంది. నిత్యం నడిచే రైళ్లతోపాటు బైవీక్లీ, స్పెషల్ ట్రైన్స్‌కు భద్రతను కల్పించడం జరుగుతుంది. కాగా పటిష్ట భద్రతపై దృష్టి సారించాల్సి ఉంటుంది.

మాయగాళ్ల బారిన..

రైళ్లలో జరిగే నేరాలతో తోటి ప్రయాణికులతో కలిసి విలువైన వస్తువులను, తియ్యటి మాటలను, కలుగోలుపు మాటలతో మోసపుచ్చి దర్జాగా దొంగతనాలు పాల్పడే విధంగా జరిగే నేరాలు అధికంగానే ఉన్నాయి. దొంగలు మాటలు కలిపి కొంత నమ్మకాన్ని కల్పించడంతోపాటు మత్తుతో మిళితమైన తినుబండారాలను అందించి నిద్రలోకి జారిస్తారు. అనంతరం వంటిపై ఉన్న నగలు, విలువైన వస్తువులను తాపీగా దోచుకొని ఉడాయిస్తుంటారు. ఇలాంటి వాటిపై ఎప్పటికప్పుడు ప్రయాణాలు, ప్రచార మాధ్యమాల ద్వారా రైల్వే శాఖ హెచ్చరిస్తుంటుంది.

మహిళల అభద్రతాభావం

రైలులో ప్రయాణించేటప్పుడు ముఖ్యంగా మహిళలే జాగ్రత్తగా ఉండాలి. ఒంటరిగా లెట్రిన్ వైపు వెళ్లినప్పుడు డోర్ వద్ద నిలబడి సమయం చూసి దోచుకెళ్లి దూకేస్తుంటారు. ఒక్కొక్కసారి మహిళలను డోర్ల వద్ద నుంచి నెట్టివేయడం జరుగుతుంది. ఆ సమయంలో మహిళలు ఒంటరిగా వెళ్లకుండా తోడుగా ఎవ్వరైనా వెళ్లాలి. మరోవైపు మహిళలకు తోటి ప్రయాణికుల నుంచి లైంగిక వేధింపులు ఎదరవుతున్నాయి. కోచ్‌లలో మద్యం సేవించడమే కాకుండా ఆపైన మహిళా ప్రయాణికుల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తుంటారు. ఇలాంటి సమయంలో మహిళలు విధి నిర్వహణలో ఉన్న జీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ బలగాలు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. రైలు ప్రయాణాల్లో ముఖ్యంగా రాత్రి పూట బోగి కిటికీలే దొంగలు టార్గెట్ చేస్తారడానికి అనేక కేసుల్లో కూడా నమోదై ఉన్నాయి.

రద్దీగా నడిచే రైళ్లు ఇవే..

ఉభయ జిల్లాలోని రైలుమార్గంలో నడిచే రైళ్లలో సామర్థ్యం కన్నా అధికంగా వెళ్తున్నారు. తిరుపతి, చెన్నై, కన్యాకుమారి, ముంబయి, కోల్హాపూర్, హుబ్లీ, కర్నూలు, గుంటూరు, విశాఖ, హైదరాబాదు, నిజామాబాద్, కాచిగూడా తదితర మహానగరాలకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిత్యం రద్దీతోనే నడుస్తుంటాయి. జనరల్ బోగీలతోపాటు రిజర్వేషన్ బోగీలు కూడా ఫుల్‌గా ఉంటున్నాయి. ఇందుకు తగ్గట్టుగా ఆయా రైళ్లకు పోలీసుల పహారా కూడా అదే స్థాయిలో ఉంటేనా ప్రయాణీకులకు భద్రత కల్పించినట్లవుతుంది.

రాత్రి పూట ఎస్కార్ట్ పెంచాం



జిల్లా మీదుగా ఏడు రైళ్లకు రాత్రి పూట ఎస్కార్ట్ పెంచాము. జీఆర్‌పీ విభాగం కూడా పలు రైళ్లకు ఎస్కార్ట్ పెంచింది. ప్రయాణాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నాం. రాత్రి వేళలో కిటికీల వద్ద జాగ్రత్తగా ఉండాలి. ఇతరులు ఇచ్చే పదార్థాలు తీసుకోరాదు. మాయగాళ్ల బారిన పడరాదు. ప్రయాణకులు తమ వంతు బాధ్యతగా ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

– శ్రీనివాసులు, ఐపీఎఫ్, రైల్వే రక్షక దళం, కడప

భద్రతపై దృష్టి సారించాలి



వేసవిలో పలు రైళ్లు రద్దీగా నడుస్తున్నాయి. నిరంతర నిఘా ఉండాలి. రైలు ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలి. గుంటూరు–తిరుపతి రైలు దోపిడీతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రైలు ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాల్సిన బాధ్యత రైల్వే శాఖపై ఎంతైనా ఉంది. రాత్రి వేళలో ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఎస్కార్ట్ విస్తృతంగా పెంచాలి.

–హిమగిరి యాదవ్, వైఎస్సార్‌సీపీ బీసీ నేత, నందలూరు

నీట్‌లో విశ్వసాయి ప్రభంజనం



సత్తా చాటిన విద్యార్థులతో కళాశాల చైర్మన్

నెల్లూరు (టౌన్) : నీట్ ఫలితాల్లో విశ్వసాయి విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని కళాశాలలో ఆలిండియా స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం వారు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కె.జీవన్‌రెడ్డి 613, సుహిత 598, నిధి 597 మార్కులు సాధించారని చెప్పారు. ఒకే కళాశాల నుంచి 101 మంది విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్‌ల్లో చేరేందుకు అర్హత సాధించారన్నారు. ఒత్తిడి లేని విద్య, విద్యార్థుల పట్టుదలే ఈ విజయానికి కారణమన్నారు.

బైక్‌ను బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

మైదుకూరు : పట్టణంలోని వనిపెంట రహదారిలో గురువారం మోటార్ బైక్‌పై వస్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చాపాడు మండలం వి.రాజుపాళెం గ్రామానికి చెందిన నరసింహుల్లు వనిపెంట వైపు నుంచి మైదుకూరుకు బైక్‌పై వస్తుండగా పోరుమామిళ్ల వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో అతనికి తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అతనిని కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు అర్బన్ ఎస్ఐ మద్దిలేటి తెలిపారు.

పాముకాటుతో అస్వస్థత

మదనపల్లె : పాము కాటుతో చిన్నారి అస్వస్థతకు గురైన సంఘటన గురువారం సత్యసాయి జిల్లా తనకల్లు మండలంలో జరిగింది. చీకటిమానుపల్లె పంచాయతీ ఇందుకూరువారిపల్లెకు చెందిన గణేష్, తేజస్విని దంపతుల కుమార్తె త్రివేణి (9 నెలలు) ఇంటి ముందు ఆడుకుంటుండగా పాము కాటేసింది. బాధితురాలిని ఆస్పత్రిలో చేర్పించారు.

వక్ఫ్ ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు నాటుతున్న వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌బాషా తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో వక్ఫ్‌బోర్డు పరిధిలోకి వచ్చే మసీదులు, దర్గాలు, పీర్ల చావిడిలకు సంబంధించిన వ్యవసాయ భూములు, స్థలాలు ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఏపీ వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్‌బాషా హెచ్చరించారు. సిద్దవటం మండలం లింగంపల్లి గ్రామంలో పీర్ల చావిడికి సంబంధించి సర్వే నంబరు 138లోని 2.94 ఎకరాలు, 3.87 ఎకరాలు కొంతమంది ఆక్రమించుకోగా, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌బాషా తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి భూముల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపల్లెలోని ఆ భూమి ఏపీ వక్ఫ్‌బోర్డుకు చెందిందని తెలిపారు. ఈ మేరకు వక్ఫ్ ఆస్తిగా నోటిఫై చేసి ఏపీ గెజిట్‌లో 1964 మార్చి 26వ తేదీ ప్రచురించారని పేర్కొన్నారు. గెజిట్ నంబరు 13 పార్ట్–2లో ఈ విషయాన్ని పొందుపరిచారన్నారు. కనుక ఎవరూ వక్ఫ్ ఆస్తుల దురాక్రమణకు పాల్పడవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు కార్యాలయ సిబ్బంది అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి మృతి



మృతి చెందిన రవీంద్రారెడ్డి

పోరుమామిళ్ల : చల్లగిరిగెలకు చెందిన గూడపురెడ్డి రవీంద్రారెడ్డి (45) గురువారం ఉదయం గ్రామ సమీపంలోని పట్టాభి రామస్వామి దేవస్థానం సమీపంలో శవమై కనిపించారు. ఆయనకు భార్య రాజ్యలక్ష్మి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పోలీసులకు సమాచారం తెలియడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోరుమామిళ్లకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐని విచారణ చేయగా.. రవీంద్రారెడ్డి పూర్తిగా మద్యానికి బానిసయినట్లు బంధువులు తెలిపారని, బుధవారం రాత్రి బాగా తాగి, ఇంటికి వచ్చే సమయంలో దాహంతో గొంతు ఎండి మృతి చెంది ఉంటాడని చెప్పారన్నారు. అతని మృతిపై ఎలాంటి అనుమానాలు కనిపించలేదన్నారు. రవీంద్రారెడ్డి కట్టెలు కాల్చి బొగ్గు అమ్ముకుని, ఆ డబ్బుతో తాగుతుంటాడని, ఇంటి బాధ్యతలు పట్టించుకునే వాడు కాదని బంధువులు తెలిపారు.

గూడెంచెరువు పోస్టాఫీసులో గోల్‌మాల్



గూడెంచెరువు గ్రామంలోని పోస్టాఫీసు

జమ్మలమడుగు రూరల్ : పేద, మధ్య తరగతి ప్రజలు తాము సంపాదించుకున్న కాస్తో, కూస్తో డబ్బులు బయటి వారికి ఇస్తే గ్యారంటీ ఉండదని భావించి.. బ్యాంకుల్లో గానీ, పోస్టాఫీసులో గానీ కూడబెట్టుకోవడం జరుగుతుంది. ఇటీవల బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ డబ్బులను వాడుకున్న సంఘటన జమ్మలమడుగు మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు పట్టణం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న గూడెంచెరువు గ్రామంలో పోస్టాఫీసు ఉంది. కాగా ఈ గ్రామానికి చుట్టు పక్కల దాదాపు 10 గ్రామాలు ఉన్నాయి. అనేక మంది ప్రజలు డబ్బులను పోస్టాఫీసులో పొదుపు చేసుకోవడం జరుగుతుంది. ఇటీవల గ్రామానికి చెందిన పోస్టాఫీసులో విధులు నిర్వహిస్తున్న ఓ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ రూ.15 లక్షలను వాడుకుని అవకతవకలకు పాల్పడ్డాడు. ఖాతాదారులు పొదుపు చేసుకున్న డబ్బుకు రశీదు ఇచ్చాడు. అయితే పోస్టాఫీసు రికార్డుల్లో డబ్బు జమ చేయలేదు. ఇటీవల ఖాతాదారుడు అనుమానం వచ్చి పాస్‌బుక్ తీసుకుని వచ్చి పోస్టాఫీసులో డబ్బు ఎంత ఉందని అధికారులను అడుగగా.. సుమారు 9 వేల రూపాయల తేడా వచ్చింది. వెంటనే గ్రహించిన జమ్మలమడుగు పోస్టాఫీసు అధికారులు ఉన్నతాధికారులకు విషయాన్ని చేరవేశారు. విచారణ చేపట్టిన అధికారులు దాదాపు రూ.15 లక్షల అవకతవకలు జరిగాయని నిర్ధారణకు వచ్చారు. గూడెంచెరువులో విధులు నిర్వహిస్తున్న బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ గత డిసెంబరులో బదిలీపై ఎర్రగుంట్లకు వెళ్లడంతో విషయం బయటకు వచ్చింది. అధికారులు అతన్ని పిలిపించి విచారణ చేయగా అసలు విషయం బయటపడింది. వెంటనే అతన్ని సస్పెండ్ చేశారు. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ ఉన్నతాధికారి అనిల్‌రెడ్డిని వివరణ కోరగా.. పోస్టాఫీసులో రూ.15 లక్షల అవకతవకలు జరిగిన విషయం వాస్తవమేనని తెలిపారు. అయితే ఇప్పటికే రూ.12.70 లక్షలు రికవరీ చేశామని పేర్కొన్నారు. మరో 25 శాతం ఖాతాదారులు పోస్టాఫీసుకు వస్తే వారి రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

రెవెన్యూ, పోలీసుల వాగ్వాదం



వాగ్వాదానికి దిగిన రెవెన్యూ, పోలీస్ అధికారులు

జమ్మలమడుగు : పట్టణంలో అర్బన్ పోలీసులు, రెవెన్యూ ఉద్యోగుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గురువారం పోలీసుస్టేషన్ రహదారిలో ఎక్కువగా వాహనాలు నిలపడంతో ఇతర వాహనాలు సైతం వెళ్లలేకపోవడంతో.. పోలీసులు రోడ్డుకు అడ్డంగా ఉన్న ద్విచక్ర వాహనాల ముందు భాగాలను పగులగొట్టారు. వాటిలో తహసీల్దార్ వేణుగోపాల్ వాహనం ఉండటంతో.. అర్బన్ సీఐ సదాశివయ్య, తహసీల్దార్ వేణుగోపాల్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రహదారికి అడ్డంగా వాహనాలు ఉంటే పోలీసులు జరిమానాలు వేయాలే తప్ప.. ఇలా స్కూటర్‌లను పగులగొట్టడం సరైంది కాదంటూ రెవెన్యూ ఉద్యోగులు పోలీసు స్టేషన్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే పోలీసుల వాదన మరోలా ఉంది. తాము ఎవరి స్కూటర్‌ల అద్దాలను పగులగొట్టలేదని, ఇతర వాహనాలు తగిలి ఏమైనా పగిలిపోయాయేమో తమకు తెలియదని సీఐ సదాశివయ్య పేర్కొన్నారు.

నో పార్కింగ్

పాత బస్టాండ్‌లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదుదారులు, రైతులు ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వస్తుంటారు. అయితే సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం చుట్టూ అధికారులు రాళ్లను పాతేశారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం లోపలికి వెళ్లకుండా అధికారులు రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రజలు పోలీస్‌స్టేషన్ రహదారితోపాటు ఎక్కడ పడితే అక్కడ ద్విచక్రవాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయనే వాదన ఉంది. అంతేకాకుండా చిరవ్యాపారులు సైతం అక్కడ బండ్ల మీద వ్యాపారాలు చేసుకుంటుండటంతో వాహనాలు నిలుపుకోవటానికి కూడా ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్‌ని నియంత్రించి వాహనాలు పెట్టుకోవటానికి పార్కింగ్ స్థలం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

అవమానభారంతో యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అవమాన భారంతో యువతి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. వేంపల్లె పంచాయతీ వేంపల్లె దళితవాడకు చెందిన స్వాతి(22), ఆమె తండ్రి కదిరప్ప, తల్లి శ్యామలపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఘటనలో తనను దుర్భాషలాడటంతో అవమానంగా భావించిన స్వాతి క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.